విశాలాంధ్ర గోదావరి జిల్లా
కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

దోష రహిత, పారదర్శక ఓటర్ల జాబితా లక్ష్యం

విశాలాంధ్ర - కాకినాడ : ఎన్నిక కమిషన్ ఆదేశాల మేరకు దోషరహిత, పారదర్శకమైన ఓటర్ల జాబితాను రూపొందించడమే లక్ష్యమని కాకినాడ సిటీ నియోజకవర్గ ఈఆర్వో, కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు స్పష్టం చేశారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం గుర్తింపు పొందిన

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ప్రగతిని ఆయన ఆయా పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఫారం 6,7,8 ద్వారా దాదాపు 91,533 దరఖాస్తులు రాగా, చాలా వరకు పరిష్కరించామన్నారు. ఫోటోగ్రాఫిక్ సిమిలర్ ఎంట్రీస్ (పిఎస్ఈ), డెమోగ్రాఫిక్ సిమిలర్ ఎంట్రీస్ (డిఎస్ ఈ) క్రింద గుర్తించిన 3260 మందికి నోటీసులు జారీ చేశామన్నారు. నిర్ణీత కాలవ్యవధిలో వీటిని కూడా త్వరలోనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కొత్త ఓట్ల కోసం వచ్చిన దరఖాస్తుల్లో సుమారు 1200 దరఖాస్తులను నిర్ధారించుకున్నామన్నారు. డిసెంబర్ చివరినాటికి పెండింగ్‌లో ఉన్న ఫారం 6,7,8లను పరిష్కరించి వచ్చే ఏడాది జనవరి 5వ తేదీన స్పష్టమైన, పారదర్శక ఓటర్ల తుది జాబితాను ప్రచురిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు రావూరి వెంకటేశ్వరరావు, రోకళ్ళ సత్యనారాయణ(వైయస్సార్సీపి), తుమ్మల రమేష్, గదుల సాయిబాబా(టిడిపి), గాంధీ రాజు(కాంగ్రెస్), అప్పారావు (బీఎస్పీ), ఏఈఆర్వోలు కోన శ్రీనివాస్, సీతాపతి, నాగశాస్త్రులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ

విశాలాంధ్ర - కరప : కరప మండలం పాతర్లగడ్డ గ్రామంలో ఉన్న పూర్ణోదయ ఆగ్రోఫుడ్ రైస్ మిల్లును జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.విజయ్ కుమార్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రైస్ మిల్లులో జిపిఎస్ విధానాన్ని దాని పనితీరును పరిశీలించారు. రైతుల వద్ద నుండి మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు

చేస్తున్నారా లేదా అని రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం కళ్ళాల్లో ఉన్న ధాన్యం వద్దకు వెళ్లి అక్కడున్న రైతులతో ధాన్యం కొనుగోలు పై చర్చించారు. దాళ్వాలో రైతులు డిసెంబర్ 10వ తేదీ నాటికి వెద చల్లుకునే విధానాన్ని అవలంబించాలని, డిసెంబర్ 30 నాటికి నాట్లు పూర్తిచేసే విధంగా రైతులు సన్నద్ధం కావాలని రైతులకు తెలిపారు. అనంతరం గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి ఏసుబాబు ఆధ్వర్యంలో కేఎంజి కెనాల్ పరిశీలించి తూటు కాడ, గుర్రపు డెక్క తొలగించేందుకు పై అధికారులతో మాట్లాడారన్నారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ బాబురావు, మండల వ్యవసాయ అధికారి రాజేష్, గాయత్రీ దేవి, గ్రామ రెవెన్యూ అధికారి కిషోర్, వ్యవసాయ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమన్యాయ సత్య సోదకుడు పూలే

విశాలాంధ్ర - కాకినాడ/రామచంద్రపురం: డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం పాత బస్టాండ్ వద్ద సుఖీభవ చారిటబుల్ ట్రస్ట్, అలయన్స్ క్లబ్ ఆఫ్ కాకినాడ స్వాతి హెల్పింగ్ హాండ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ట్రస్ట్ అధ్యక్షులు నాగిరెడ్డి వెంకన్న అధ్యక్షతన ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలుగుదేశం రాష్ట్ర ఆరోగ్య విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి, అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిబిరంలో పూలే వర్ధంతి వేడుకలను నిర్వహించారు. అనంతరం డాక్టర్ చప్పిడి మాట్లాడుతూ కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు కృషి చేసిన మహోన్నతుడు పూలే అని, 1873 సెప్టెంబరు 24న, పూలే తన అనుచరులతో కలిసి, దిగువ కులాల ప్రజలకు సమాన హక్కులను పొందటానికి సత్యశోధక్ సమాజ్ (సొసైటీ ఆఫ్ సీకర్స్ ఆఫ్ ట్రూత్)ను ఏర్పాటు చేసారని అన్నారు. ఈ కార్యక్రమంలో కెవిఆర్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ కెవివి సత్యనారాయణ చేస్తున్న సేవా కార్యక్రమాలకు డాక్టరేట్ వచ్చిన సందర్భంగా ఆయనకు చిరు సత్కారం చేశారు. అనంతరం శిబిరానికి వచ్చిన సుమారు 600 మందికి డాక్టర్ చప్పిడి, డాక్టర్ కెవివి సత్యనారాయణ, డాక్టర్ ఇషా దీప్తి మధుమేహం రక్తపోటు వైద్య పరీక్షలు చేసి వారికి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అల్లై వనుం ఉపేంద్రనాథ్, నాగమణి, నేదూరి శేషగిరి, ఈతా ప్రసాద్, జి. రాజేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

విశాలాంధ్ర - పిఠాపురం రూరల్ : పిఠాపురం మండలం భోగాపురంలో సుమారు కోటి 16 లక్షల ఇంటింటికి కుళాయి కలెక్షన్ జల జీవన్ మిషన్ పనులకు ఎమ్మెల్యే పెండెం దొరబాబు మంగళవారం శంకుస్థాపన చేశారు.

ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఉన్న మంచినీటి సమస్య ప్రస్తుతం వాటర్ ట్యాంకర్ నిర్మించడంతో తీరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ బుర్రా అనుబాబు, ఎంపీటీసీ వెన్నపు గంగా నీలవేణి, గ్రామ సభల కమిటీ వెన్నపు చిట్టిబాబు, సర్పంచ్ నేపాల వీరలక్ష్మి వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు స్కూలు బ్యాగ్‌ల పంపిణీ

విశాలాంధ్ర - చాగల్లు : చాగల్లు మండలం మదర్ తెరిసా సేవా సమితి అధ్యక్షులు పోలిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం తాపీ మేస్త్రి వల్లభనేని దుర్గాప్రసాద్ రాజకుమారి దంపతుల కుమార్తె జయశ్రీ లక్ష్మి మొదటి పుట్టినరోజు వేడుకలను చాగల్లు భవిత కేంద్రం దివ్యాంగుల సమక్షంలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులు 50 మందికి స్కూలు బ్యాగులు, డ్రై ఫ్రూట్స్, ఫ్రూట్స్ పంపిణీ చేశారు. వృద్ధులు పదిమందికి

దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కరటూరి సతీష్ మాట్లాడుతూ దివ్యాంగులు, వృద్ధులను చేయూతనివ్వడం దైవ కార్యక్రమం అని అన్నారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ దంపతులను ఆదర్శంగా తీసుకొని దివ్యాంగులకు, వృద్ధులకు సేవలు అందించాలని విశ్రాంత ఎంఈఓ కోడి నాగేశ్వరరావు కొనియాడారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ముల్లపూడి రాము, కోడి చంటియ్య, భవిత కేంద్రం నిర్వాహకులు బి.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అధికారంలోకి రాగానే శెట్టిబలిజ భవనానికి నిధులు

విశాలాంధ్ర - రాజోలు : రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి రాగానే రాజోలు తాలూకా శెట్టిబలిజ సంక్షేమ సంఘం నూతన భవన నిర్మాణానికి నిధులు కేటాయిస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చారు. యువగళం పాదయాత్ర చేస్తున్న లోకేష్ తాటిపాకలోని శెట్టిబలిజ సంక్షేమ సంఘ కార్యాలయం ముందు నుండి వెళు

తుండగా రాజోలు తాలూకా శెట్టిబలిజ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు అనుచూరి రామపురుషోత్తం వినతిపత్రం సమర్పించారు. 40 ఏళ్ల కిందట నిర్మించిన పాత భవనం పూర్తిగా శిథిలమైందని, దాని స్థానే నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని కోరారు. టిడిపి బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి చెల్లుబోయిన శ్రీనివాస్ ఈ భవన నిర్మాణ ఆవశ్యకతను లోకేష్‌కు వివరించగా ఆయన సానుకూలంగా స్పందించారు.

లబ్ధిదారులకు కొండపోడు పట్టాల పంపిణీ

విశాలాంధ్ర - శంఖవరం : శంఖవరం మండలంలోని జి కొత్తపల్లి, గౌరంపేట, పెదమల్లాపురం, శంఖవరం తదితర గ్రామాల లబ్ధిదారులకు 234 కొండపోడు పట్టాలను మంగళవారం శంఖవరం తహసిల్దార్ కే సుబ్రహ్మణ్యం, డిప్యూటీ తహసిల్దార్ శ్రీనివాస్ కొత్తపల్లిలో అందజేశారు. లబ్ధిదారులంతా అధికారులు, ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ఈగల విజయదుర్గ, రామిశెట్టి ఏసుబాబు, మాజీ జెడ్పిటిసి ఈగల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రూ.380 కోట్లతో విద్యుత్ ఉపకేంద్రానికి శంకుస్థాపన

విశాలాంధ్ర - అమలాపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి గ్రామంలో 380 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించ తలపెట్టిన విద్యుత్ ఉపకేంద్రం వలన జిల్లా వాసులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ పేర్కొన్నారు. మంగళవారం ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ లిమిటెడ్ నేతృత్వంలో 380 కోట్ల వ్యయంతో నిర్మించతలపెట్టిన అయినవిల్లి 400/132 కెవి విద్యుత్ ఉపకేంద్రం, సంబంధిత లైను పనులకు శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తాడేపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయం నుండి వర్చువల్ విధానంలో పూర్తి చేశారు. అయినవిల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్, పి.గన్నవరం శాసనసభ్యులు కొండేటి చిట్టిబాబు, శాసన మండలి సభ్యులు కుడిపూడి సూర్యనారాయణ, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కోనసీమ ప్రజల చిరకాల వాంఛ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం కలగా ఉండేదన్నారు. గత 15 ఏళ్లగా కృషి చేస్తున్నప్పటికీ అయినవిల్లి గ్రామస్తులు భూములు ఇవ్వడానికి ముందుకు రావడంతో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సహకారంతో విద్యుత్ ఉపకేంద్రాన్ని శంకుస్థాపన చేసుకున్నట్టు తెలిపారు. ఈ

ఉపకేంద్రం ఏర్పాటు వలన దైనందిన జీవితంలో విద్యుత్తు సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు. నూతన జిల్లాగా ఏర్పడిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఐటీ రంగంలోనూ, పారిశ్రామికంగా అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నందున 400/132 కెవి విద్యుత్తు ఉపకేంద్రం ఎంతో దోహదపడు తుందని మంత్రి పేర్కొన్నారు.

గన్నవరం శాసనసభ్యులు కొండేటి చిట్టిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని సంక్షేమ రంగాలకు ప్రాధాన్యతమిస్తుందని, అందులో భాగంగానే కోనసీమ ప్రజలకు విద్యుత్ కష్టాలను తీర్చే విధంగా అయినవిల్లి గ్రామంలో విద్యుత్ ఉపకేంద్రం నిర్మించడానికి శంకుస్థాపన పనులు చేసుకోవడం హర్షించదగిన విషయం అన్నారు. . ట్రాన్స్కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శివరామకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం కోనసీమ ప్రాంత పరిధి విద్యుత్ అవసరాలు తీర్చుటకు 220/ 132 కెవి కాకినాడ, 132 కెవి భీమవరం విద్యుత్ ఉప కేంద్రాల నుండి విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక వ్యవసాయ, గృహ అవసరాలు తీర్చుటకు ఆయా ఉప కేంద్రాల సామర్థ్యం సరిపోని కారణం చేత అయినవల్లి గ్రామంలో అధిక స్థాయి వోల్టేజ్ సామర్థ్యంలో 400/132 కెవి విద్యుత్ ఉపకేంద్రం నిర్మించుకోవడానికి ప్రజా ప్రతినిధుల ప్రోత్సాహం ఎంతైనా ఉందన్నారు. ఈ ఉపకేంద్రం వలన అమలాపురం, కొత్తపేట, ముమ్మిడివరం, రాజోలు, రామచంద్రపురం, కాకినాడ, భీమవరం, నరసాపురం విద్యుత్ ఉప కేంద్రాల సామర్థ్యం మరింత మెరుగుపడడమే కాగా భవిష్యత్తు తరాల విద్యుత్ అవసరాలకు ఈ ఉపకేంద్రం వల్ల లబ్ది చేకూరుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వివరించారు. నిర్మాణం వల్ల సుమారు 25 లక్షల మందికి లబ్ది చేకూరుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యుత్ ఉపకేంద్రం శంకుస్థాపన ఫలకాన్ని మంత్రి, ఇతర ప్రజా ప్రతినిధులతో కలిసి ఆవిష్కరిం చారు. ఈ కార్యక్రమంలో కాశి ముని కుమారి, చైర్మన్ హితకారిణి సమాజం, మట్టపర్తి నాగ విజయలక్ష్మి ఎంపీపీ అయినవిల్లి, గన్నవరపు శ్రీనివాస్ జడ్పిటిసి, కాకర బాబ్జి సర్పంచ్, ట్రాన్స్కో సూపరింటెండెంట్ ఇంజనీర్ టీవీఎస్ ఎన్ మూర్తి, ఈఈ యం రవికుమార్, స్థానిక ప్రజా ప్రతినిధులు, ట్రాన్స్కో అధికా రులు, గ్రామస్తులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్తు అందించడమే లక్ష్యం

- రూ.40.50 కోట్లతో నిర్మించనున్న విద్యుత్ ఉపకేంద్రం
- శంకుస్థాపనలో జిల్లా,కలెక్టర్,ఎంపీ భరత్,ఎమ్మెల్యే రాజా

విశాలాంధ్ర - రాజానగరం : రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా అవసరమైన చోట విద్యుత్ ఉప కేంద్రాలు నిర్మాణం చేపట్టే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్ జగన్మోహన్ రెడ్డి చర్యలు తీసుకుంటారని జిల్లా

కలెక్టర్ కె.మాధవి లత అన్నారు. రూ:40.50 కోట్ల వ్యయంతో మండలంలోని వేపకాయల దిబ్బలో నూతనంగా నిర్మించనున్న 220/33 విద్యుత్ ఉపకేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. దీనిలో భాగంగా జిల్లా కలక్టర్ మాధవి లత, రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్,రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కలిపి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని రంగాలు అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తున్నదని చెప్పారు. పారిశ్రామిక,వ్యవసాయ రంగానికి నాణ్యమైన విద్యుత్ అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారన్నారు.ఎంపీ భరత్ మాట్లాడుతూ ఏ రాష్ట్రమైనా ప్రగతి పథంలోకి వేగంగా అభివృద్ధి చెందాలంటే స్థానికంగా అవసరా లకు అనుగుణంగా విద్యుత్తు అందించినప్పుడు మాత్రమే సాకారం అవుతుంద న్నారు. తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షులు,ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ గడిచిన కాలంలో దివంగత వైఎస్సార్ హయాంలో పవర్ సెక్టార్ కు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి రైతాంగానికి ఉచితంగా 7 గంటల విద్యుత్ అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మంధారపు సితారత్నం వీర్రాజు,విద్యుత్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలైనా అర్పిస్తాం... పట్టా భూములు సాధిస్తాం

విశాలాంధ్ర - గోపాలపురం : ప్రాణాలైనా అర్పిస్తాం పట్టా భూములు సాధిస్తాం అంటూ భీముడు గ్రామానికి చెందిన పట్టాదారులు తమ గళాన్ని ఘాటుగా వినిపించారు. మంగళవారం మండలం లోని బీమోలు గ్రామంలో పట్టాదారుల సమక్షంలో

గోపాలపురం ఏఎంసీ డైరెక్టర్ సాలి వేణు, దళిత సంఘాల నాయకుడు కొడవటి బుజ్జిబాబు సారధ్యంలో పట్టాదారులకు జరుగుతున్న అన్యాయాలపై పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాలి వేణు, కొడవటి బుజ్జిబాబు సంయుక్తంగా మాట్లాడుతూ ల్యాండ్ సీలింగ్‌లో భాగంగా ఆనాటి ప్రభుత్వం సుమారు 356 ఎకరాల భూమిని 146 మంది దళిత, బడుగు, బలహీన వర్గాలకు ఇచ్చారని తెలిపారు. ఆనాటి నుండి భూమిని కోల్పోయిన సర్వరాయుడు అండ్ కో కృత్రిమ కౌలు దారులు సృష్టించి వారి సహకారంతో కోర్టులో కేసులు వేయించి భూములను తిరిగి కైంకర్యం చేసుకునే దురుద్దేశం లో భాగంగా అనేక రీతులుగా పట్టాదారులపై పలు సందర్భాల్లో కేసులు దాడులు చేయించారని విమర్శించారు. పోలీసు యంత్రాంగం కూడా శ్రమజీవుల సమస్యలను సానుకూలంగా అర్థం చేసుకొని భూస్వాములకు కొమ్ముకాయ వద్దని బడుగు బలహీన దళిత వర్గాలకు న్యాయం చేసేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైకాపా నాయకులు కాకులపాటి శ్రీను, కాకర్ల గంగరాజు, పట్టాదారులు కాకులపాటి వెంకట్రావు, మరపట్ల వెంకటేశు, వేములూరు సత్తియ, కడిమి చిట్టమ్మ, కొట్రా కృష్ణ, కాకులపాటి సీతయ్య, మల్లిపూడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మహేంద్ర ఆత్మహత్యకు కారకులను వెంటనే అరెస్ట్ చేయాలి

విశాలాంధ్ర-కొవ్వూరు : దొమ్మేరు బొంత మహేంద్ర హత్య కేసులో దోషులను తక్షణమే అరెస్టు చేయాలని మంత్రి మేరుగ నాగార్జునకు వినతిపత్రం ఇచ్చారు.బొంత

మహేంద్ర హత్య జరిగి 15 రోజులు గడిచినా నేటికీ దోషులను అరెస్టు చేయలేదని, వారు బయట ఉండి సాక్ష్యాలు తారుమారు చేసే ప్రమాదం ఉందన్నారు. విదసం ఐక్యవేదిక అధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జునను కలిసి విజ్ఞప్తి చేశారు.మంగళవారం గుంటూరులో మంత్రి కార్యాలయంలో డాక్టర్ బూసి వెంకట రావు, బొంత శామ్ రవి ప్రకాష్ నేతత్వంలో మృతుడు మహేంద్ర సోదరుడు బొంత రమేష్, గ్రామ యువకులు మంత్రి నాగార్జునను కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు.

రోటరీ క్లబ్ రక్తదాన శిబిరం

విశాలాంధ్ర - రాజోలు : రాజోలు రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ ఏడిద కవీంద్ర ఆధ్వర్యంలో రాజోలు ప్రభుత్వ డిగ్రీ కాలేజిలో మంగళవారం రోటరీ క్లబ్ రక్తదాన శిబిరాన్ని నిర్వహించింది. 45 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. రోటరీ బ్లడ్ బ్యాంక్ కాకినాడ నుండి వచ్చిన వైద్య సిబ్బంది రక్తాన్ని సేకరించారు. రక్తదాతలకు అమలాపురం హెచ్డిఎఫ్సి బ్యాంకు వారు బహుమతులు అందించారు. రక్తదాతలకు సంవత్సర కాలానికి గాను లక్ష రూపాయల ఇన్సూరెన్స్ కల్పిస్తున్నట్టు బ్లడ్ బ్యాంక్ వైద్యులు డాక్టర్ కామరాజు తెలిపారు. విద్యార్థులను ఎంతగానో ప్రోత్సహించి కార్యక్రమం విజయవంతం కావడంలో సహకరించినందుకు కాలేజీ ప్రిన్సిపాల్ సాయిబాబుని రోటరీ క్లబ్ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి లక్ష్మణరావు, కంచర్ల పూర్ణచంద్రరావు, తణుకు శ్రీనివాసరావు, మహమ్మద్ మోహిద్దీన్, దార్ల పెద్దబాబు, కసుకుర్తి రామకృష్ణ, కృష్ణమోహన్, బోళ్ళశ్రీను, సోమరాజు, ఇతర రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

సమ సమాజ సాధనకు కృషి చేయాలి

జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ

విశాలాంధ్ర - కాకినాడ : మహత్మా జ్యోతీరావ్ పూలే కాంక్షించిన సమ సమాజ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ కోరారు. మహాత్మా జ్యోతిరావ్ పూలే వర్ధంతి పురస్కరించుకుని మంగళ



వారం స్థానిక జిజిహెచ్ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియ, శాశన మండలి సభ్యులు కర్రి పద్మశ్రీ, కాకినాడ అర్బన్ ఎఎంసి చైర్ పర్సన్ పసుపులేటి వెంకట లక్ష్మి, అయ్యారక కార్పోరేషన్ చైర్ పర్సన్ ఆవాల రాజేశ్వరి పలువురు ప్రముఖులు పూలమాలలు అలంకరించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఇలక్కియ మాట్లాడుతూ స్వేచ్చా, సమానత్వంతో కూడిన సమాజం కోసం ఉద్యమం సాగించిన జ్యోతీరావు పూలే గొప్ప సంస్కర్త అని కొనియాడారు. ఆయన కృషి వల్లే తదుపరి కాలంలో అణగారిన ప్రజల గౌరవం, హక్కులకు పరిరక్షణ పట్ల సమాజ దృక్పథంలో మంచి మార్పు వచ్చిందన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ బడుగు వర్గాలు, ముఖ్యంగా మహిళలు విద్య ద్వారానే సాధికారత సాధించగలరని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమాధికారి నాడు రాజేశ్వరి, బిసి కార్పొరేషన్ అద్దంకి శ్రీనివాసరావు, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ డివి రమణమూర్తి, బిసి సంక్షేమ సంఘాల నేతలు పాల్గొన్నారు.

ఏడిదలో రూ.2.40 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

విశాలాంధ్ర - మండపేట : రాష్ట్రంలోని అన్ని వర్గాలను ఆదుకుంటున్న ఏకైక ప్రభుత్వం వైసీపీ ప్రభుత్వమని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పేర్కొ న్నారు. మండలంలోని

ఏడిదలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. గ్రామ సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం అధ్యక్షతన జరిగిన కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత స్థానిక నాయి బ్రాహ్మణ సంఘం ఆధ్వ ర్యంలో ఆయనకు ఘన సత్కారం చేశారు. అనంత రం ఆయన జడ్పీటీసీ కురిపూడి భవానీ రాంబాబు, ఎంపీపీ వుండమట్ల శ్రీని వాస్, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు గ్రామ నాయ కులతో కలిసి రూ.6లక్షలతో నిర్మించనున్న రోడ్డుకు శంఖుస్థాపన చేశారు. అక్కడి నుంచి దేవుడి కాలనీలో జలజీవన్ మిషన్ ద్వారా రూ.2.29 కోట్ల వ్యయంతో నిర్మించే మంచి నీటి పథకం పనులకు భూమి పూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్క రించారు. అక్కడ నుంచి జిల్లా పరిషత్ హైస్కూల్ వెనక ఉన్న దోభీ ఘాట్ నిర్మాణ పనులను భూమిపూజ చేసారు. రూ.5 లక్షలతో రజక చెరువు చుట్టూ ఫెన్సింగ్, గ్రావెల్ రహదారి, చేతి పంపు, దోభీ ఘాట్ నిర్మాణం చేయ నున్నట్టు సర్పంచ్ ఆశీ ర్వాదం చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఐదం రాజు, పంచా యతీ కార్యదర్శి వుండ మట్ల వీర్రాజు, ఎంపీటీసీ పట్నాల నాగ బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింటు అయిన **డి.ఆర్యాపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ రాజమహేంద్రవరం మెయిన్ బ్రాంచ్** బ్యాంక్ దగ్గరికి తూర్పు గోదావరి జిల్లా, రాజమహేంద్రవరం, వి.యల్.పురం డోరునెం. 85-3-16/1 కాపురస్తులు **పీత గంగాభవాని (భర్త పీత వీర చంద్రరాజు)** ఆవిడ కుమారుడు **Peetha V.S.V.D.M. Nagendra Pavan Kumar** వచ్చి, **పీత గంగాభవాని** గారి అత్త గారు మరియు **పవన్ కుమార్** గారి నాయనమ్మ గారు అయిన **పీత సత్యవతి** గారు ఆవిడ ఆస్తి హామీ మీద అనగా ది.5-8-1981న ఆవిడ పేర రాయబడి **డాక్యుమెంట్ నెం.4631/1981**గా రాజమహేంద్రవరం సబ్-రిజిస్ట్రార్ ఆఫీసులో నమోదు అయిన ఆస్తి మీద నా క్లయింటు **ఆర్యాపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్** రాజమహేంద్రవరంలో రుణము తీసుకొని సదరు రుణము తీర్చివేసినారన్నీ అయితే, సదరు ఆస్తిలోని కొంత ఆస్తి గురించి అనగా దిగువ ఆస్తి గురించి ది.8-1-2003న అన్-రిజిస్టర్ వీలునామా రాసి, ఆవిడ కుమారుడు అయిన **పీత వీర చంద్రరాజు** గారికి దఖలు పరిచినారనీ, దర్మిలా సదరు పీత వీర **చంద్రరాజు** సదరు ఆస్తి గురించి ఆయన భార్య అయిన **పీత గంగా భవాని** గారి పేర దానపట్టా దస్తావేజు ది.3-5-2018న రాసి **డాక్యుమెంట్ నెం.4370/2018** గా రాజమహేంద్రవరం సబ్-రిజిస్ట్రార్ ఆఫీసులో నమోదు అయిన దస్తావేజు ద్వారా దఖలు పరిచినారనీ తెలియచేసి సదరు పీత సత్యవతి గారి ఒరిజినలు దస్తావేజులు తమకి ఇమ్మని కోరుచున్నారు. అందువలన సదరు వీలునామా గురించి అనగా **ది.8-1-2003న పీత సత్యవతి** గారు ఆవిడ కుమారుడు అయిన **పీత వీరచంద్రరాజు** పేర రాసిన అన్-రిజిస్టర్ వీలునామా గురించి ఎవరికైనా అభ్యంతరములున్నా ఈ దిగువ ఆస్తి మీద ఎవరికైనా హక్కులున్నా ఈ ప్రకటన వెలువడిన ఒక వారములోగా పై బ్యాంకు వారికి కాని, ఈదిగువ పేర్కొన్న లాయరు గారికి కానీ తగిన ఆధారములతో తెలియచేయవలెను. దర్మిలా వచ్చిన అభ్యంతరములు మా క్లయింటును బైండు చేయవని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

నోటీసు షెడ్యూల్

తూర్పు గోదావరి జిల్లా, రాజమహేంద్రవరం, వి.యల్.పురం, ఆర్.యస్.నెం. 301/పార్ట్, డోర్‌నెం. 85-3-16 ఇల్లు అందలి 5 ప్రతులు : 1వ ప్రతి : తూర్పు 4వ ప్రతి ఉమ్మడి స్థలము - అ 11.2లు, దక్షిణము - పీతా వీరచంద్రరాజు గారి ఆస్తికి ఈ ఆస్తికి మధ్య ఉమ్మడి గోడ - అ 35.96లు, పడమర-రోడ్డు అ 11.8లు, ఉత్తరము - 5వ ప్రతి ఉమ్మడి సందు స్థలము అ 35.96లు, 2వ ప్రతి : తూర్పు-గొర్రెల కాంతమ్మ గారి ఇల్లు అ 5-6లు, దక్షిణము - వి.రామకృష్ణ గారి ఇల్లు - అ 8-6లు, పడమర- పీత వీరచంద్రరాజు ఆస్తి అ 5-6లు, ఉత్తరము - 3వ ప్రతి ఉమ్మడి సందు స్థలము కొంత వరకు, 4వ ప్రతి ఉమ్మడి సందు స్థలము అ 8.6లు - 3వ ప్రతి -తూర్పు -4వ ప్రతి ఉమ్మడి సందు స్థలము అ 2-0లు, దక్షిణము - 2వ ప్రతి ఉమ్మడి మరుగు దొడ్డి - అ 6-6లు, పడమర-పీత వీరచంద్రరాజు ఆస్తి అ2-0లు, ఉత్తరము - పీత వీరచంద్రరాజు ఆస్తి అ 1-44 లు, - 4వ ప్రతి - తూర్పు - గొర్రెల కాంతమ్మ గారి ఇంటి స్థలము అ 18-6లు, దక్షిణము - 2వ ప్రతి ఉమ్మడి మరుగుదొడ్డి - అ 2-00లు, పడమర-3వ ప్రతి ఉమ్మడి సందు స్థలము కొంత, పీత వీరచంద్రరాజు గారి స్థలము కొంత, 1వ ప్రతి కొంత అ 18-6లు, ఉత్తరము - 5వ ప్రతి ఉమ్మడి నడవా స్థలము అ 2-1 లు 5వ ప్రతి తూర్పు - గొర్రెల కాంతమ్మ గారి ఇంటి స్థలము అ 3-0లు, దక్షిణము - 4వ ప్రతి ఉమ్మడి స్థలము కొంత వరకు, 1వ ప్రతి కొంత వరకు - అ 37.9లు, పడమర - రోడ్డు అ 3-2 లు, ఉత్తరము - గారపాటి సుబ్బారావు మేడ గోడ అ 37-9లు

పి.సూర్యనారాయణమూర్తి
బ్యాంక్ తరపు అడ్వకేట్
సెల్: 9885665808

రాజమహేంద్రవరం
28-11-2023

జ్యోతిబాపూలేకు హోం మంత్రి నివాళులు

విశాలాంధ్ర-కొవ్వూరు : భారతదేశంలో మహిళాభ్యుదయానికి కృషి చేసిన సంఘసంస్కర్తలలో జ్యోతిరావు పూలే ప్రముఖులని రాష్ట్ర హెూం మరియు విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత తెలిపారు. మంగళవారం మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా కొవ్వూరు మంత్రి క్యాంపు కార్యాలయంలో

ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. అనంతరం పూలే చేసిన సేవలను హెూంమంత్రి కొనియాడారు. ఈ సందర్భంగా హెూంమంత్రి తానేటి వనిత మాట్లాడుతూ.. జ్యోతిరావు పూలే సమ సమాజ స్థాపన కోసం అహర్నిశలు కృషి చేశారని అన్నారు. భారతదేశంలోనే తొలిసారిగా బాలికల విద్య కోసం పాఠశాలలను స్థాపించారని తెలిపారు. బాల్య వివాహాలు వ్యతిరేకించి.. వితంతు వివాహాలను ప్రోత్సహించారని తెలిపారు. మహాత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్, డాక్టర్ బాబు జగజ్జీవన్ రామ్ వంటి మహనీయులు చేసిన కృషి ఫలితంగానే నేడు కుల, మత, వర్గ విభేదాలు లేకుండా విద్య అందరకూ అందుబాటులోకి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ బోల్తా : డ్రైవర్ మృతి

విశాలాంధ్ర - తాళ్ళపూడి : తూర్పుగోదావరి జిల్లా తాళ్ళపూడి మండలం బల్లిపాడు ఇసుక ఓపెన్ ర్యాంపు వద్ద మంగళవారం వాటర్ ట్యాంక్ ట్రాక్టర్ డ్రైవర్ దుర్మరణం చెందారు. వాటర్ ట్యాంక్ ట్రాక్టర్ అదుపుతప్పి గోదావరి నది లోకి దూసు కెళ్లిందని తాళ్ళపూడి ఎస్సై కె. వెంకట రమణ తెలిపారు. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ నడుపుతున్న డ్రైవర్ దుర్గారావు (50) వ్యక్తి మృతి చెందారని, భార్య, ముగ్గురు పిల్లలు వున్నారని పేర్కొన్నారు. కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించామని తెలిపారు. సంఘటన ప్రదేశం ఎవరి పరిధి? తాళ్ళపూడి మండలం బల్లిపాడు ఓపెన్ రీచ్, సంఘటన జరిగిన ప్రదేశం ఏ రెవిన్యూ పరిధిలోకి వస్తుంది? ఏ పోలీస్ స్టేషన్ పరిధి లోకి వస్తుందన్న విషయం పై సుదీర్ఘ చర్చ జరిగింది. వేగేశ్వరపురం, బల్లిపాడు, చిడిపి వి.ఆర్.ఓ తాళ్ళపూడి, కొవ్వూరు మండలాల పోలీసులు వచ్చి సంఘటనా ప్రదేశాన్ని పరిశీలించిన అనంతరం తాళ్ళపూడి మండల పరిధిలోకి వస్తుందని నిర్ణయించారు. తాళ్ళపూడి ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుని దేహాన్ని కొవ్వూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఇసుక మాఫియా ఆగడాలకు మరొకరి బలి

విశాలాంధ్ర-కొవ్వూరు : కొవ్వూరు నియోజకవర్గంలో ఇసుక మాఫియా ఆగడాలకు అంతే లేకుండా లేకుండా పోతున్నది. మొన్నటికి మొన్న ఇసుక మాఫియా బారిన పడి కొవ్వూరు రైల్వేస్టేషన్లో ప్రేమ్ అనే వ్యక్తి పట్టాల మీద తలకాయ పెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇది గడవకముందే తాళ్లపూడి మండలం బల్లిపాడు లో అనధికార ఇసుక ర్యాంపుకు గోదావరిలో వేసిన రోడ్డు మార్గాన్ని మూడు పూటలా తడపడానికి పురమాయించుకున్నారు మాఫియా లీడర్లు ఆ ట్రాక్టర్ పని రహదారిని నీటితో తడిపి గట్టి చేయడమే వారి పని. ఎందుకంటే గోదావరిలో వేసిన అక్రమ ష్రటు రోడ్డును తడిపితే లారీల రాకపోకలకు ఇబ్బంది ఉండదనేది మాఫియా అభిప్రాయం. ఈ నేపథ్యంలోనే మంగళవారం ఇసుక ర్యాంపులో రహదారిని తడుపుతూ ఎదురుగా లోడింగ్ నింపుకోవడానికి వస్తున్న లారీలకు సైడ్ ఇచ్చే సందర్భంలో ఆ వాటర్ ట్యాంకు పక్కనున్న నీటిలో పడినట్లు తెలుస్తోంది. రేపు ప్రమాదంలో ట్యాంకర్ డ్రైవర్ మృతి చెందాడు. దీంతో అతనిని కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. ఈ సందర్భంగా స్థానిక మంత్రి వనిత కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం రూముకు వచ్చి మృతుని మరణం పట్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అసలే అనుమతులేని ఇసుక ర్యాంపు వద్ద ఇటువంటి ప్రమాదం జరగటం ఏమిటి అని మృతుని బంధువులు వాపోతున్నట్లు సమాచారం.

మోషేన్‌రాజుకు జన్మదిన శుభాకాంక్షలు

విశాలాంధ్ర-కొవ్వూరు : శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషన్ రాజు మరిన్ని ఉన్నత పదవులు స్వీకరించాలని కొవ్వూరు మున్సిపల్ చైర్ పర్సన్ భావన రత్నకుమారి అన్నారు.శాసనమండలి చైర్మన్ కొయ్య మోషన్ రాజుకు ఆమె జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. భీమవరంలో మోషన్ రాజు క్యాంపు కార్యాలయంలో

ఆయనకు పుష్ప గుచ్చం ఇచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భావన రాజేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

పథకాలపై సమీక్ష

విశాలాంధ్ర - తాళ్ళపూడి : రాష్ట్ర ప్రభుత్వ పథకాలు సక్రమంగా అమలు చేయాలని, అభివృద్ధి పనులు సకాలం లో పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి,తాళ్ళపూడి మండల ప్రత్యేకాధికారి సత్యనారా

యణ పేర్కొన్నారు. మంగళవారం తాళ్ళపూడి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా ఆడుదాం ఆంధ్ర, అంగన్వాడీ కేంద్రాల్లో దాతల సహకారం తో నిర్వహించాల్సిన బంగారు కొండ, జగనన్న లే ఆవుట్లలో గృహ నిర్మాణాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ, అంశాల పై సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ రమణ, ఎం.ఈ.ఓ. లు, హౌసింగ్ ఏ.ఈ, డి.ఈ, ఈవో. పి.ఆర్.డి వీరన్న, అంగన్వాడీ సూపరు వైజర్లు , కార్యదర్శులు పాల్గొన్నారు.

దుర్గారావు మృతదేహానికి హోంమంత్రి నివాళులు

విశాలాంధ్ర-కొవ్వూరు : తాళ్లపూడి మండలం గజ్జరం గ్రామానికి చెందిన కమిడి దుర్గారావు ప్రమాదవశాత్తూ ఆకస్మిక మృతి పట్ల రాష్ట్ర హెూం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మంగళవారం కొవ్వూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వద్దకు హెూంమంత్రి వెళ్లి ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

వారి కుటుంబ సభ్యులను ఓదార్చి.. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రమాద వివరాలను వారి కుటుంబ సభ్యులను హెూంమంత్రి అడిగి తెలుసుకున్నారు. ప్రమాదవశాత్తు చనిపోవడంతో ట్రాక్టర్ యజమాని నుంచి రూ. 3 లక్షలు, ఇసుక ర్యాంపు యాజమాన్యం నుంచి రూ.5 లక్షలు కలిపి మొత్తం రూ. 8 లక్షల పరిహారం బాధితకుటుంబానికి అందజేయ నున్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై మాట్లాడే అర్హత వైసీపీకి లేదు

విశాలాంధ్ర - సీతానగరం: అభివృద్ధి గురించి మాట్లాడే అర్హత వైసీపీకి లేదని టీడీపీ మాజీ ఎంపీపీ సూరెడ్డి నరేంద్ర జానకి అన్నారు. మండలంలోని వంగల పూడి గ్రామంలో తన స్వగృహంలో మంగళవారం మాజీ ఎంపీపీ సూరెడ్డి నరేంద్ర జానకి విలేకరులతో మాట్లాడుతూ మండలంలో

వైసిపి చేసిన అభివృద్ధి ఇసుక అక్రమ రవాణా, చెరువులో మట్టి దోపిడీ, కొండలలో అక్రమ గ్రావెల్ తవ్వకాలని అన్నారు. పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలు ఆవ భూములు, ముంపు భూముల్లో ఇచ్చి వారిని నిలువునా అన్యాయం చేశారన్నారు. 18 కిలోమీటర్లు రహదారి నిర్మాణం నాలుగున్నర సంవత్సరాలుగా నిర్మాణం సాగిస్తున్న ఘనత వైసీపీది అన్నారు. ఈ రోడ్డు నిర్మాణం వల్ల పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ (అదనపు కార్యదర్శి) ప్రాణాలు కోల్పోయాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పుక్కాల శ్రీను, సంగన చినపోసియ్య, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల ప్రగతి వేగవంతం చేయాలి

విశాలాంధ్ర-ఏలూరు : జగనన్న ఇళ్ల నిర్మాణ ప్రగతిని వేగవంతం చేయాలని గృహ నిర్మాణ శాఖ జిల్లా మేనేజర్ కె. రవికుమార్ అధికారులను ఆదేశించారు. జగనన్న ఇళ్ల నిర్మాణ ప్రగతి తీరుపై తహసీల్దార్లు, ఎంపిడిఓ లు, గృహ నిర్మాణ శాఖ ఇంజినీర్లతో మంగళవారం కలెక్టరేట్ లోని గోదావరి సమావేశపు హాలులో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ జగనన్న ఇళ్ల పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నదని, జిల్లాలో జగనన్న ఇళ్ల నిర్మాణాల పనులను వేగవంతం చేసేందుకు డిసెంబర్ 1వ తేదీ నుండి జనవరి, 30వ తేదీ వరకు 60 రోజులపాటు ప్రత్యేకంగా 'మెగా కంప్లీషన్ డ్రైవ్ ను నిర్వహించడం జరుగుతుంద న్నారు. ఈ డ్రైవ్ లో ఇప్పటికే ప్రారంభించిన 21 వేల ఇళ్ల నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు కృషి చేయాలని ఆయన ఇంజనీరింగ్ అధికారులకు పిలుపునిచ్చారు.

అందరి భాగస్వామ్యంతో ఆడుదాం.. ఆంధ్ర

విశాలాంధ్ర-ఏలూరు: రాష్ట్రంలో 15 ఏళ్లు వయస్సు పైబడిన అన్ని వయస్సుల వారిని క్రీడల్లో భాగ స్వామ్యం చేయడం ద్వారా శారీరక, మానసిక ధృడత్వం, ఆనందాన్ని సొంతం చేసుకొనే దిశగా నిర్వహి స్తున్న ఆడుదాం..ఆంధ్ర క్రీడోత్సవాల్లో ప్రతిఒక్కరూ భాస్వామ్యం కావాలని ఇన్ చార్జి కలెక్టర్ బి. లావణ్యవేణి తెలిపారు. స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో మంగళవారం డిశంబరు 15 నుంచి నిర్వహించే ఆడుదాం..ఆంధ్ర క్రీడోత్సవాల నిర్వహణ ఏర్పాట్లను ఇన్ చార్జి కలెక్టర్ బి.లావణ్యవేణి పాత్రికేయులకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా యువతను క్రీడల్లో ప్రోత్సాహాన్ని పెంచడానికి, క్రీడలుపట్ల మక్కువ, ఆరోగ్యకరమైన జీవనాన్ని సాధించడానికి ఆడుదాం.. ఆంధ్ర క్రీడల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ టోర్నమెంట్ మొత్తం 51 రోజుల పాటు పండగలా జరగ నున్నదన్నారు. గ్రామ/ వార్డ్ స్థాయి లో 18రోజులపాటు డిసెంబర్ 15 నుండి జనవరి 1 వరకు మండలస్థాయి లో 14 రోజుల పాటు జనవరి 2 నుండి జనవరి 15 వరకు నియోజకవర్గస్థాయి లో 6రోజుల పాటు జనవరి 16 నుండి జనవరి 21 వరకు జిల్లా స్థాయిలో వారం రోజులపాటు - జనవరి 22 నుండి జనవరి 28 వరకు రాష్ట్ర స్థాయి లో 6 రోజులపాటు జనవరి 29 నుండి ఫిబ్రవరి 2 వరకు క్రీడోత్సవాలు నిర్వహించబడతాయని 2024 ఫిబ్రవరి 3వ తేదీన మన ఆడుదాం ఆంధ్ర విశాఖపట్టణంలో ముగుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సెట్ వెల్ సిఇఓ ఎండి మోహరాజ్, డిఎస్ డిఓ బి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు 9 మంది ఎస్ఆర్‌కెఆర్ విద్యార్థులు

విశాలాంధ్ర -భీమవరం: జెఎన్‌టియు కె తరఫున జాతీయస్థాయిలో వివిధ యూనివర్సిటీల మధ్య జరిగే ఇంటర్ యూనివర్సిటీ, సౌత్ జోన్ పోటీలకు ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కళాశా లకు చెందిన 9 మంది క్రీడాకారులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి మురళీకృష్ణ రాజు అన్నారు. మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంపికైన క్రీడాకారులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం జగపతి రాజు మాట్లాడుతూ సెంట్రల్ జోన్లో ఎన్నో విజయాలు సాధించిన తమ కళాశాల క్రీడాకారులు సౌత్ జోన్ లో కూడా మంచి ఫలితాలు సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ సిహెచ్ హరిమోహన్ మాట్లాడుతూ బ్యాడ్మింటన్ విభాగంలో పి.రక్షిత, తేజస్వి, వాలీబాల్ విభాగములో కె.వికాస్ బాబు, జై.మానస , హ్యాండ్ బాల్ విభాగంలో బి.చైతన్య లహరి, ఆర్.అఖిల శ్రీవల్లి, ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ నెట్ బాల్ పోటీలకు తమ కళాశాల నుండి ఎంపికైన క్రీడాకారుల్లో పి.రిషిక, విజయ సాహితీ, వర్మ, షేక్ నిషా, జి.శ్రీనివాసరావు ఎంపికయ్యారన్నారు. ఇంటర్ కాలేజీఏట్ సెంట్రల్ జోన్ విభాగంలో బ్యాడ్మింటన్ లో సెంట్రల్ జోన్లో మహిళా విభాగం రన్నర్స్ గాను, వాలీబాల్ ఉమెన్స్ విభాగంలో మూడవ స్థానంలోనూ నిలిచారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్స్ జి.సారిక, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి

విశాలాంధ్ర - కైకలూరు : మండలంలోని కైకలూరు111, ఆటపాక131, గోనేపాడు132 వ బూత్ లో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పెన్మత్స త్రినాథ్ రాజు, క్లస్టర్ పోలవరపు లక్ష్మీ రాణి ఆధ్వర్యంలో తెలుగు దేశం పార్టీ - జనసేన పార్టీ పర్యవేక్షణలో జరుగుతున్న బాబు తో భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ చంద్రబాబు - పవన్ కళ్యాణ్ అధికారంలోకి వచ్చిన వెంటనే 2024 జూన్ నెల నుండి ప్రతి కుటుంబానికి వచ్చే సంక్షేమ పథకాలు అమలు చేస్తామని అన్నారు. అనంతరం పార్టీ విధానాలను వివరిస్తూ మహిళలకు భవిష్యత్తుకు గ్యారెంటీ - ఇది బాబు గ్యారెంటీ హామీ పత్రాలను అందిస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు పెన్మేత్స వెంకటేశ్వర రాజు(వెంకటరాజు), ముదినేపల్లి మండల ప్రజా పరిషత్ మాజీ అధ్యక్షులు వీరమల్లు నరసింహారావు, టిడిపి నాయకులు బి.కె.యమ్ నాని,రాష్ట్ర తెలుగుయువత కార్యనిర్వ హక కార్యదర్శి పూల రామచంద్రరావు(రాజీ),వీరాబత్తిన సుధ, జనసేన నాయకులు కొల్లి వరప్రసాద్(బాబి), భుజబలపట్నం మాజీ సర్పంచ్ గుజ్జుల రామలక్ష్మీ,మండల తెలుగు మహిళా కార్యదర్శి శీలం కృష్ణవేణి,కైకలూరు పట్టణ టిడిపి ఉపాధ్యక్షులు పడమట వాసు, రుద్రరాజు రాజా,పలివెల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

యువత ఓటుహక్కు నమోదు చేసుకోవాలి

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం : 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని చింతలపూడి నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈ.ఆర్.ఓ),స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కే.గీతాంజలి సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు ఓటరు నమోదుపై అవగాహన సదస్సు కళాశాల ప్రిన్సిపల్ డా. ఎన్. ప్రసాద్ బాబు అధ్యక్షతన సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ మరియు ఎలక్టోరల్ పార్టిసిపేషన్ వారి ఆధ్వర్యంలో జరిగింది.
ఈ కార్యక్రమానికి చింతలపూడి నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈ.ఆర్.ఓ),స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కే.గీతాంజలి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె నూతన ఓటు నమోదు పై అవగాహన కల్పించారు.18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు తమ తమ గ్రామాల్లో ఉన్న బీఎల్ ఓ లను కలిసి ఓటు నమోదు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమం అనంతరం ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎతఈఆర్ఓ, తహశిల్దార్ కే. స్లీవ జోజి,చింతలపూడి ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్ శేఖర్ బాబు,కళాశాల వైస్ ప్రిన్సిపల్ బి. శ్రీనివాసరావు, పొలిటికల్ సైన్స్ అధ్యాపకుడు,ఎమ్.శ్రీనివాసరావు,అధ్యాపకులు యు.వెంకటా చార్యులు, సిహెచ్. బదరీ నారాయణ తెలుగు విభాగం నుంచి డా. జి వెంకట లాల్, వి. హనుమంతరావు, ఇతర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది ,కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

సమైక్యత చాటేందుకు వన మహోత్సవాలు

విశాలాంధ్ర - లింగపాలెం : సమైక్యత కోసం కార్తీక మాసాన్ని పురస్కరించుకుని బిజెపి ఆధ్వర్యంలో వన మహోత్సవాలను నిర్వహి స్తున్నామని ఈ పార్టీ జిల్లా అధ్యక్షులు చవటపల్లి విక్రమకిషోర్ తెలిపారు. ధర్మాజీగూడెంలో మంగళవారం పార్టీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహిం చారు. డిసెంబరు 2 నుంచి వనమహోత్సవాలు మొదలవుతాయని, 2న ఏలూరు, దెందులూరు నియోజకవర్గాలకు గోపన్నపాలెం, 5న చింతలపూడి, పోలవరం నియోజకవర్గాలకు జంగారెడ్డిగూడెంలో, 7న నూజివీడు నియోజకవర్గానికి నూజివీడులో, 9న కైకలూరు నియోజకవర్గానికి కైకలూరులో, 11న ఉంగుటూరు నియోజకవర్గానికి ఉంగుటూరులో వన మహోత్సవాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వీటికి ముఖ్యఅతిధులుగా అగ్ర నాయకులు హాజరవుతారని వివరించారు. ఆర్ఎస్ఎస్ సంస్థాగత ప్రధాన కార్యదర్శి మధుకర్‌జీ, రాష్ట్ర పార్టీ అధ్యక్షురాలు పురందేశ్వరి, జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామంజనేయచౌదరి(తపన చౌదరి), జాతీయ కార్యదర్శి సత్యకుమార్, ఏలూరు జిల్లా ఇన్‌చార్జి ఎపిఆర్ చౌదరి వన మహోత్సవాలలో పాల్గొంటారని తెలిపారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిబాపూలే

విశాలాంధ్ర-ఏలూరు: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే అని ఆంధ్రప్రదేశ్ బీసీ, ఓ బి సి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్వీఆర్ విఠల్ కొనియాడారు. మహాత్మ జ్యోతిబాపూలే 134 వ వర్ధంతి సందర్భంగా ఏపీ బీసీ, ఓబిసి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ వద్ద గల మహాత్మ జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు పూలమాలవేసి, నివాళులర్పించారు. సందర్భంగా విఠల్ మాట్లాడుతూ దేశంలోనే అంటరానితనం ను ఎదిరించిన మొట్టమొదటి సంఘ సంస్కర్తగా , స్త్రీలకు విద్య అవసరమని, సమాన హక్కులు, వితంతువులకు వివాహాలు చేయటం వంటి అనేక స్త్రీ జనార్ధరణ కార్యక్రమాలు చేపట్టారన్నారు. మొట్టమొదటి మహాత్మా అని పిలిపించుకున్న మహోన్నత మైన వ్యక్తి అని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ పామర్తి ఏసు రాజు, దేవరకొండ వెంకటేశ్వరరావు, ఎస్టీ ఎంప్లాయిస్ అధ్యక్షులు,,టౌన్ అధ్యక్షులు డాక్టర్ లక్ష్మీనారాయణ, మార్గాని శ్రీనివాస్, , రాష్ట్ర యాదవ్ సంఘ అధ్యక్షులు ఉక్కు సూరి గోపాలకృష్ణ , రాజు, విశ్వబ్రాహ్మణ సంఘం డైరెక్టర్ లక్కోజు రాజగోపాలాచారి,అజయ్ బాబు, అచ్యుత్ పూలే, ఆదిశేషు, సూర్యం మాస్టారు,హుస్సేన్,మట్ట నాగేంద్ర, ఎంవి సుబ్బారావు, రామ సూరి,వివిధ బీసీ సంఘాల నాయకులు, ఎంప్లాయిస్ పాల్గొన్నారు.

ముదినేపల్లిలో: మహాత్మ జ్యోతిరావు పూలే చిరస్మరణీయులని ముదినేపల్లి సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ , వైసీపీ రాష్ట్ర నాయకులు నిమ్మగడ్డ బిక్షాలు పేర్కొన్నారు. జ్యోతిరావు పూలే వర్ధంతిని ముదినేపల్లి సెంటర్లోని పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విగ్రహ కమిటీ అధ్యక్షులు పళ్ళెం పుణేశ్వరరావు సభ్యులు జన్ను వీర వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు. మండల పరిషత్ ప్రాంగణంలో కార్యాల యం ఎఒ రమణబాబు, సీనియర్ అసిస్టెంట్ ఎం నాగేశ్వరరావు , జూనియర్ అసిస్టెంట్ సుబ్బారావు పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. ముదినేపల్లి సెంటర్లో కైకలూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మంగనేని బాబ్జి, నాయకులు గోళ్ళ రాజ్ కుమార్ పూలే విగ్రహానికి పూలమాలలు వేసి బడుగు , బలహీన వర్గాలకు ఆయన చేసిన సేవలను కొనియాడారు.

కైకలూరులో: మండలంలోని ఆటపాకలో నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయం (మాగంటి నిలయం) లో నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో సామా జిక అసమానతల మీద అలుపెరుగని పోరాటం చేసి అణగారిన వర్గాల విద్యాభివృద్ధికి కృషి చేసిన సంఘసంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే 133 వ వర్ధంతి సందర్భంగా పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు పెన్మేత్స త్రినాథ్ రాజు, ముదినేపల్లి మండల ప్రజా పరిషత్ మాజీ అధ్యక్షులు వీరమల్లు నరసింహారావు,పెన్మేత్స వేంకటేశ్వరరాజు(వెంకటరాజు), మాజీ జడ్పీటీసీ బొమ్మనబోయిన విజయలక్ష్మీ,బి.కె.యమ్ నాని, రాష్ట్ర తెలుగుయువత కార్యనిర్వహక కార్యదర్శి పూల రామచంద్రరావు(రాజీ),తెలుగు దేశం పార్టీ నాయకులు వీరాబత్తిన సుధ,కైకలూరు పట్టణ టిడిపి ఉపాధ్యక్షులు పడమట వాసు తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెంలో : బడుగు, బలహీన వర్గాల పాలిట ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిరావు పూలే అని చింతలపూడి ఎమ్మెల్యే వీ.ఆర్. ఎలిజా అన్నారు. స్థానిక చింతలపూడి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాల యంలో మహాత్మ జ్యోతిరావు పూలే 133 వ వర్ధంతి కార్యక్రమం పట్టణ వైసీపీ అధ్యక్షుడు చిటికెల అచ్యుత రామయ్య అధ్యక్షతన జరిగింది. ఎమ్మెల్యే ఎలీజా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలిజా మాట్లాడుతూ అంటరాని తనం, కుల వ్యవస్థ నిర్మూలన కు పూలే ఎంతగానో పోరాడారని అన్నారు.మహిళలు, అణగారిన కులాల ప్రజలకు విద్యను అందించడంలో ఆయనతో పాటు ఆయన భార్య సావిత్రీబాయి పూలే చేసిన కృషి వల్ల భారతదేశంలో స్త్రీల విద్యకు మార్గదర్శకు లయ్యా రని అన్నారు. అనంతరం ఆర్టీసి బస్టాండ్ వద్ద ఉన్న పూలే విగ్రహానికి వైసీపీ నాయకులు పూల మాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు,వైసీపీ నాయకులు మండవల్లి విజయ సారథి,మేడవరపు విద్యాసాగర్ ,షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అక్బర్, కౌన్సిలర్లు ఎల్వీఆర్, నేకూరి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

వీరవాసరంలో : మహిళాభ్యున్నతికి ఎనలేని కృషి చేసిన గొప్ప వ్యక్తి మహాత్మా జ్యోతిరావు పూలే అని వైసిపి మండల కన్వీనర్ కడలి ధర్మారావు తెలిపారు. మహాత్మా జ్యోతి రావు పూలే వర్ధంతి సంద ర్భంగా స్థానిక బస్టాండ్ సెంటర్లో మంగళవారం పూలే చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూలే వంటి మహనీయుని అడుగు జాడలలో నడిచి సమసమాజ స్థాపనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. ఎఎంసి చైర్మన్ కోటిపల్లి బాబు మాట్లాడుతూ పూలే అంటరాని ప్రజల హక్కులకోసం, బాల్య వివాహాల నిర్మూలన కోసం సాంఘిక దురాచారాలు, మూఢనమ్మకాల వంటి సామాజిక రుగ్మతల నిర్మూనలపై పోరాటం చేసారన్నారు. గ్రామ సర్పంచ్ చికిలే మంగతాయారు మాట్లా డుతూ సమాజంలో మహిళల అణిచివేతపై పోరాడిన ప్రముఖ సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే అన్నారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు నూకల కనకారావు, ఏఎంసి డైరెక్టర్ మతల కాశి, వీరవల్లి రాధాకృష్ణ, పాలా నాగరాజు, పేరాబత్తుల బాబి, మద్దాల బాబి, సురేష్, బాబి, పలువురు నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నం పేటలో స్మశాన వాటికను అభివృద్ధి చేయించిన చిన్నం

విశాలాంధ్ర -చాట్రాయి : చిన్నంపేటలో దళితుల స్మశాన వాటికను నూజివీడు మాజీ శాసనసభ్యులు చిన్నం రామ కోటయ్య అభివృద్ధి చేయించారు. నూజివీడు శాసనసభ స్థానం నుండి పోటీ చేయాలని ముందుకు వస్తున్న చిన్నం రామకోటయ్య ఇటీవల తన అనుచరుడు కొమ్ము సృజనరావు నివాసానికి వచ్చిన ఆయనను గ్రామానికి చెందిన పలువురు దళితులు స్మశాన వాటిక సమస్యను వివరించడంతో స్పందించిన రామకోటయ్య స్మశాన వాటికను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయించుకోవాలని దానికి అయ్యే ఖర్చులు తానే ఇస్తానని చెప్పడంతో కొమ్ము సృజన్ రావు మాజీ సర్పంచ్ కునికేరి నాగమల్లేశ్వరరావులు స్మశాన వాటికలో జంగిల్ క్లియరెన్స్ చేయించి స్మశాన వాటిక లోకి వెళ్లే దారిని కూడా అభివృద్ధి చేశారు. రెండు దళిత వాడలలో వేలాదిమందికి ఉపయోగపడే పని చేయించిన రామ కోటయ్య మేలు ఎన్నటికీ మరువలేమని పలువురు దళితులు కొనియాడుతున్నారు.

మహాత్మా జ్యోతిరావుపూలేకు టీడీపీ నివాళులు

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ తాళ్లరేవు మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా స్థానిక తాళ్ళరేవు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పూలే చిత్ర పటానికి టీడీపీ శ్రేణులతో కలసి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన రాష్ట్ర తెలుగు యువత కార్య నిర్వహక కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ (బాబి) మాట్లాడుతూ పూలే అణగారిన వర్గాల అభ్యున్నతికి, వారి విద్యాభివృద్ధికి కృషి చేసిన సంఘసంస్కర్త సామాజిక తత్వవేత్త అన్నారు. కులవివక్షకు వ్యతిరేకంగా నాలుగు దశాబ్దాల పాటు సామాజిక ఉద్యమం నడిపిన మహానుభావుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని, ఆయన వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుని సేవలను స్మరించుకోవడం మన బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు పొన్నమండ రామలక్ష్మి, వెంటపల్లి ఉమామహేశ్వరి, అమలాపురం పార్లమెంటు బిసి సెల్ అధ్యక్షుడు వాడ్రేవు వీరబాబు, అధికార ప్రతినిధి టేకుమూడి లక్ష్మణరావు, కార్యాలయ కార్యదర్శి మందాల గంగ సూర్యనారాయణ, జక్కుల ప్రసాద్ బాబు, వాశంశెట్టి శ్రీనివాసరావు, గంజా సూరిబాబు, నడింపల్లి వినోద్, వరదరాజు, దుర్గా ప్రసాద్, చంద్రమౌళి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్న సమారాధన

విశాలాంధ్ర-దేవరపల్లి : :కార్తీక మంగళవారం పురస్కరించుకుని దేవరపల్లిలోని అభయ ఆంజ నేయ స్వామి ఆలయంలో భారీ స్థాయిలో అన్న సమారాధన నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, సింధూరం తమలపాకులతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కార్తీకమాసంలో మంగళ వారాల రోజున అన్న సమాధాన నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆంజనేయుడి విశిష్టతను తెలిపారు.

ఘనంగా నాయి బ్రాహ్మణ వన సమారాధన

విశాలాంధ్ర - నిడదవోలు : నిడదవోలు పట్టణ నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో కార్తీకమాస వన సమారాధన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే జి శ్రీనివాస నాయుడు, మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పట్నాల గౌరీ గణపతి, తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సంఘ అధ్యక్షులు గంగిరెడ్డి శంకర్రావు మాట్లాడుతూ పట్టణంలో నాయి బ్రాహ్మణ కమిటీ హాల్ నిర్మాణానికి స్థలాన్ని మంజూరు చేయాలని భవన నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జి శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ భవన నిర్మాణానికి సహకరిస్తానని అన్నారు. అనంతరం వివిధ సంస్కృతిక ఆటల పోటీలను పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కొత్తపల్లి సుప్రియ, అహ్మదున్నీసా బేగం పలువురు సంఘ సభ్యులు నాయకులు కుటుంబసమేతంగా పాల్గొన్నారు.

ఉజ్జీవ మహాసభలు విజయవంతం చేయండి

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట మండల పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 32వ వార్షిక ఉజ్జీవ మహాసభలను విజయవంతం చేయాలని మండల పాస్టర్స్ అసోసి యేషన్ అధ్యక్షులు డాక్టర్ పి ఆనంద్ బాబు, కార్యదర్శి రెవరెండ్ కిషోర్ బాబు, కోశాధికారి రెవరెండ్ పి.బన్ను ప్రసాద్, ఉపాధ్యక్షులు బిషప్ పి. జ్ఞానరాజు పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 28వ తేదీ మంగళవారం సాయంత్రం నుంచి ప్రారంభమై డిసెంబర్ ఒకటో తేదీ వరకు సామర్లకోట ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్స్‌లో 32వ వార్షిక మహాసభలు, క్రిస్మస్ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మహాసభల్లో ముఖ్య ప్రసంగికులుగా విజయవాడకు చెందిన ఫిలదెల్ఫియ ఏజీ చర్చ్ దైవజనులు రెవరెండ్ చార్లెస్ పి జాకబ్, పెద్దాపురం పట్టణానికి చెందిన బైబిల్ మిషన్ జాయింట్ సెక్రెటరీ డాక్టర్ జీఆర్ ఇమ్మానియేలు, బెంగళూరుకు చెందిన సమర్పన్ డి వర్షిప్ బ్యాండ్ అధినేత ఇవి జోయల్ ఎస్.బాబ్, గ్లోబల్ పీస్ అంబాసిడర్ డాక్టర్ డాక్టర్ కె. బెన్నీ ప్రసాద్‌లు విచేస్తున్నట్లు చెప్పారు. శక్తివంతమైన ఆరాధన, ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలను సందర్శించి వచ్చిన దేవుని సాక్షి ఆయన బెన్నీ ప్రసాద్ అద్భుత సాక్ష్యం, జీవితాలను మార్చగలిగే శక్తివంతమైన దైవ వర్తమానాలు ఈ సభల్లో ప్రత్యేకత సంతరించుకుంటున్నట్టు చెప్పారు. ఈ సభలో టౌన్ క్రిస్టియన్ యూత్ ఆధ్వర్యంలో మధురమైన క్రైస్తవ సంగీతం, ప్రత్యేక గీతాలాపన కార్యక్రమాలను చేపడుతున్నట్లు చెప్పారు. డిసెంబర్ ఒకటో తేదీన మండల పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్రాండ్ క్రిస్మస్ ఆరాధన జరుపుతున్నట్టు చెప్పారు. ఈ ఉజ్జీవ మహాసభలు, క్రిస్మస్ ఆరాధనల్లో ఉభయ తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఆత్మీయ మేలులు పొందాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ సందర్భంగా సభల గోడపత్రికలను వారి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల పాస్టర్ అసోసియేషన్ నాయకులు పలువురు పాల్గొన్నారు.

చొప్పెల్లలో గడపగడపకు మన ప్రభుత్వం

విశాలాంధ్ర - ఆలమూరు : అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలంలోని చొప్పెల్ల గ్రామంలో సర్పంచ్ దంగేటి చంద్రకళ బాపనయ్య అధ్యక్షతన మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం జరిగింది. ఈ కార్యక్రమంలో కొత్తపేట శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి పాల్గొని ముందుగా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో పర్యటిస్తూ నాలుగున్నర సంవత్సరాలుగా వైఎస్ఆర్ ప్రభుత్వం చేపట్టిన వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కార దిశగా అధికారులు ముందుకు సాగా లన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తోరాటీ లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటీ సీతా మాలక్ష్మి రాంబాబు, వైసీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆ తమ్ముడ్ని నేను చదివిస్తా

విద్యార్థి ఆవేదన విని స్పందించిన లోకేష్

విశాలాంధ్ర - అమలాపురం : ఆర్థిక ఇబ్బందులతో చదువు మానేసిన ఓ విద్యార్థి ఆవేదనను విన్న టిడిపి యువనేత నారా లోకేష్ చలించిపోయారు. ఆ తమ్ముడ్ని చదివించే బాధ్యత తాను తీసుకుంటానని భరోసా ఇచ్చారు. అమలాపురం నియోజకవర్గం భట్నవిల్లిలో యువతతో ముఖాముఖి నిర్వహించిన యువనేత వారి సాధకబాధకాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అమలాపురం నియోజకవర్గం కోడురుపాడు చెందిన కె దుర్గారెడ్డి తమ కష్టాలను తెలియజేస్తూ "తాను అమలాపురంలోని ఎస్ కెబిఆర్ కళాశాలలో గత ఏడాది ఇంటర్ హెచ్ఇసి గ్రూప్‌లో చేరానని అన్నారు. అక్కడ సరైన సదుపాయాలు లేక చదువు మానేశానని, తర్వాత ఐటీఐ చదువుతానని నాన్నతో చెబితే మనకు అంత స్థోమత లేదు, వద్దన్నారని పేర్కొన్నాడు. దాంతో టిసి తీసుకొని ఇంటివద్దే ఉంటూ చిన్నచిన్న పనులు చేసుకుంటున్నానని చెప్పాడు. దీంతో యువనేత లోకేష్ స్పందిస్తూ ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువు ఆపేసిన దుర్గారెడ్డిని తాను చదివిస్తానని చెబుతూ సంబంధిత విద్యార్థి వివరాలు తీసుకోవాల్సిం దిగా వ్యక్తిగత సిబ్బందిని ఆదేశించారు.

గంగంపాలెంలో రూ. 16 కోట్లతో అభివృద్ధి

విశాలాంధ్ర -గోకవరం: మండలంలోని గంగంపాలెం గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా 66 మంది నిరుపేద లబ్ధిదారులకు మంగళవారం జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల చంటిబాబు చేతుల మీదుగా పట్టాల పంపిణీ చేశారు. తొలుత దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఠాకుర్ పాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన హెల్త్ క్లినిక్ సెంటర్ భవనాన్ని ఎమ్మెల్యే చంటిబాబు ప్రారంభించారు. అనంతరం గంగంపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే చంటిబాబు మాట్లాడుతూ గంగంపాలెం గ్రామంలో సుదీర్ఘకాలం 40 సంవత్సరాలు పైబడి నుండి పోడు భూముల పట్టాలు లబ్ధిదారులకు ఎంతమంది ఎమ్మెల్యేలు, మంత్రులు మారినప్పటి నుండి ఇప్పటివరకు ఇవ్వలేదని ప్రస్తుత సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో భూ హక్కు పట్టాలు పంపిణీలో భాగంగా 66 మంది లబ్ధిదారులకు పోడు భూముల పట్టాలు ఇచ్చినట్టు తెలిపారు. గంగపాలెం గ్రామంలో సుమారు 16 కోట్ల రూపాయలతో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని తెలిపారు.

ఎన్‌టి రాజాపురంలో జగనే ఎందుకు కావాలి

విశాలాంధ్ర - గండేపల్లి : ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం జెడ్పీటీసీ పరిమి వెంకటలక్ష్మి మంగతాయారు బాబు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి మళ్లీ ఎందుకు ఎన్నుకోవాలో వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంపై అన్ని శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించా లన్నారు. సమస్యలు లేకుండా తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చలగళ్ళ దొరబాబు, కుంచె రాజా, కేతిన బాబి, సర్పంచ్ బిక్కిన దేవి దుర్గ, ఎంపీడీవో వెంకటరామన్, తహసిల్దార్ సత్యనారాయణ, ఈఓఆర్ డి మూర్తి, కార్యదర్శి తరంగిణి, వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర - సీతానగరం: చంద్రబాబుతోనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి సాధ్యం అని రాజానగరం నియోజకవర్గ టిడిపి ఇంచార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి అన్నారు. మండలంలో గల రఘుదేవ పురం గ్రామంలో మంగళవారం బొడ్డు వెంకటరమణ చౌదరి ఆధ్వర్యంలో బాబు బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా వెంకటరమణ చౌదరి ఇంటి ఇంటికి తిరుగుతూ చంద్రబాబు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల మ్యానిఫెస్టో గురించి వివరించారు. అలాగే రాష్ట్రానికి వైసీపీ పాలనలో జరుగుతున్న అన్యాయం గురించి తెలిపారు. ఈ సందర్భంగా వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి తిరోగమనంలో సాగింది అని దుయ్యబట్టారు 2024 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ గెలుపు ఖాయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాండ్రు శ్రీనివాస రావు, వలవల రాజా, సంగన చినపోసియ్య, కాశీ, చుండ్రు సత్య ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాపులను బీసీల్లో చేర్చాలి

విశాలాంధ్ర - అమలాపురం : జాతీయ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో కాపునాడు వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బిరెడ్డి సురేష్ అమలాపురం మహిపాల వీధిలో కలిసి వినతి పత్రం సమర్పించారు. తెలుగుదేశం ఆవిర్భావం నుండి జరిగిన అన్ని ఎన్నికలలోనూ కాపు, ఉప కులాల సామాజిక వర్గీయులు తెలుగుదేశం పార్టీకి వెన్నుముకగా నిలిచి పార్టీ అధికారంలోకి రావడానికి విశేష కృషి చేశారన్నారు. తక్షణమే తమను బీసీలుగా గుర్తించి రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గంగుమళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర - జగ్గంపేట : ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్ కే దక్కుతుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సేవాదళ్ జనరల్ సెక్రటరీ, కాకినాడ జిల్లా జెసిఎస్ కో ఆర్డినేటర్ ఒమ్మి రఘురామ్ అన్నారు. జగ్గంపేట సచివాలయం 2 వద్ద ఉప సర్పంచ్, సచివాలయాల మండల కన్వీ నర్ బండారు రాజా అధ్యక్షతన మంగళ వారం జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ముందుగా సచివాలయంలో ఏర్పాటు చేసిన డిస్ప్లే బోర్డ్‌ని ఆవిష్కరించారు. అలాగే పార్టీ జెండాలను ఎగురవేశారు. తదుపరి జరిగిన సభలో బండారు రాజా మాట్లాడుతూ గత చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు ఏ మేర నెరవేర్చారో, జగన్ అధికారంలోకి వచ్చిన హామీలు ఏ మేర తీర్చారో రిపోర్ట్ కార్డు చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఈఓ పిఆర్‌డి కొండలరావు, వైస్ ఎంపీపీ నక్కా శ్రీను, రాజపూడి సర్పంచ్ బుసాల విష్ణుమూర్తి, మండల కో ఆప్షన్ మెంబెర్ జాన్ వెస్లీ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టంపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - గొల్లప్రోలు : గొల్లప్రోలు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినీలకు వినియోగదారులు హక్కుల పరిరక్షణ చట్టం,విధి విధానాలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పిఠాపురం వినియోగదారులు సంఘం అధ్యక్షుడు డి.నారాయణ మూర్తి అధ్యక్షత వహించగా వినియోగదారులు సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి హెచ్ఎస్ రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా వినియోగదారులు హక్కుల పరిరక్షణ చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. దీనివలన కొనుగోలు దారులకు జరుగుతున్న మోసాలపై సత్వర న్యాయం జరగటానికి అవకాశం ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపా ధ్యాయులు సిహెచ్ఎస్‌పి రెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీలో భారీ అవకతవకలు

విశాలాంధ్ర - కిర్లంపూడి : కిర్లంపూడి మండలం జగపతినగరం గ్రామపంచాయతీ పరిధిలోని చిల్లంగి, జగపతినగరం, కిర్లంపూడి గ్రామాల్లో 2022 -23 సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో భారీ అవకతకులు జరిగాయని మూడు గ్రామాలకు చెందిన పలువురు రైతులు, గ్రామస్తులు ఆరోపించారు. మంగళవారం జగపతినగరం పంచాయతీ ఆవరణలో సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత అధ్యక్షతన ఉపాధి హామీ గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో సామాజిక తనిఖీ ప్రజావేదిక డిఆర్‌పి, డేవిడ్ రాజు ఆధ్వర్యంలో పంచాయతీ పరిధిలో మూడు గ్రామాల్లోను ఉపాధి హామీ పథకంలో చేపట్టిన, చెరువు,కాలువ పనులను వివరించారు. అసలు గత రెండు, మూడు సంవత్సరాలుగా ఉపాధి హామీ పథకంలో ఎటువంటి కాలువ పనులు చేపట్టకుండా, చేసినట్టు ఎలా చూపిస్తారని మాజీ సర్పంచ్ పెంటకోట కూడా నాగబాబుతో పాటు, కంపరపు నాగేశ్వరరావు పలు రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. లక్షలాది రూపాయలతో కాలువ పనులు చేపట్టడం జరిగిందని సభలో డేవిడ్ రాజు వివరించడానికి ప్రయత్నించడంతో గ్రామసభలో రైతులు, పలువురు గ్రామస్తులు ఆశ్చర్య వ్యక్తం చేశారు. కాలువ పనులు చేపట్టకుండా చేసినట్టు ఎలా చెబుతున్నారని గత ఏపీవో చిరంజీవిరావును పలువురు నిలదీశారు. దీంతో గ్రామసభ రసాభసాగా మారింది. దీంతో డిఆర్పి డేవిడ్ రాజు మాట్లాడుతూ గ్రామ సభలో జరిగిన అభ్యంతరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని తెలిపారు. ఒకటో తారీఖున జరిగే మండల స్థాయి సామాజిక తణిఖీ ప్రజా వేదికలో వివరించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం అవకతవకల్లో జరిగిన ప్రతి రూపాయిని రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ నాగమణి, ఈవోపీఆర్డి మార్కండేశ్వరరావు, పంచాయతీ సిబ్బంది ధనుంజయ, వైస్ ఎంపీపీ బోడ్డేటి గణపతి, పెనగంటి రాజేష్, ఎంపిటిసి సాదే కుమారి, ఉపాధి సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.